

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,20 జనవరి 2026

8 పేజీలు




# మురుగప్ప 'ముప్పు'లో.. మురిపాల కాకినాడ!




**ఎరువుల తయారీలో దేశంలోనే అగ్రగామి సంస్థ 'కోరమాండల్'.. ఇప్పుడు కాకినాడలో తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తోంది!**


రూ.5,000 కోట్ల భారీ పెట్టుబడితో, ఏటా 30 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా కొత్త ప్లాంట్లను నిర్మిస్తోంది! అయితే, గాలిని శుద్ధి చేయాల్సిన 'గ్రీన్ బెల్ట్' చెట్లను తొలగించి మరీ ఈ రసాయన కర్మాగారాలను కడుతున్నారు! దీనివల్ల గాలిలో కలిసే గంధకపు ఆమ్లం, విషవాయువులు సామాన్యుడి ఊపిరితిత్తులను దెబ్బతీసే ముప్పు పొంచి ఉంది! గతంలో జరిగిన గ్యాస్ లీకేజీ ప్రమాదాలు మరువకముందే.. నివాస ప్రాంతాల మధ్య ఈ విస్తరణ భయాన్ని కలిగిస్తోంది! లాభాల వేటలో యాజమాన్యం, మౌనంగా ఉన్న అధికారులు.. కాకినాడ ప్రజల ఆరోగ్యానికి గ్యారెంటీ ఎవరు? దీనిపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం..

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :

- మిగతా 2 లో..




- 'ఆంధ్ర పారిస్'పై ఆమ్లపడగ..
- అక్షరాలా ఇది పర్యావరణ దహనకాండ!
- లాభాల వేటలో మురుగప్ప 'కోర'లు..
- స్మార్ట్ సిటీకి 'వాయు' గండం.. మన శ్వాసపై కార్పొరేట్ దాడి!



## కాకినాడ నగరానికి ఆకర్షణీయమైన ముఖద్వారాలు

**- ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**




**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ నగరానికి మంచి ముఖద్వారం తీసుకొచ్చే దిశగా చర్యలు చేపడుతున్నామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఆయన కాకినాడ నగరంలోని ఇంద్రపాలెంలాకులు,ప్రతాప్‌నగర్ బ్రిడ్జి,అన్నమ్మ ఘాటి సెంటర్, ఎంఎస్ఎస్ చార్టీస్ ప్రాంతాలను పరిశీలించారు. ఈప్రాంతాల్లో ఆకర్షణీయమైన ముఖద్వారాలు ఏర్పాటు చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేరుకు మాత్రమే కాకినాడ స్మార్ట్ సిటీగా ఉందని, స్మార్ట్ సిటికి తగిన విధంగా నగరం అభివృద్ధి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో గత పాలకుల కారణంగా కాకినాడ స్మార్ట్ సిటీ ప్రతిష్ట దిగజారిందని ఆరోపించారు. కాకినాడ నగరానికి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు

- తరువాయి 2లో..

## నిడదవోలు నియోజకవర్గంలో మంత్రి కందుల దుర్గేష్ సుడిగాలి పర్యటన

**-గత పాలకుల నిర్లక్ష్యం వల్లే రోడ్లు ఈ దుస్థితిలో ఉన్నాయని మంత్రి దుర్గేష్ విమర్శ**



**నిడదవోలు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ సోమవారం నిడదవోలు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను, ముఖ్యంగా రహదారి నిర్మాణాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా తాళ్లపాలెం గ్రామంలో పర్యటించిన మంత్రి,సింగవరంనుండి నందమూ రు వరకు నాబార్డు నిధులతో చేపట్టిన 2.5కి.మీల రోడ్డునిర్మాణ పనులను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. 2019-24 మధ్యకాలంలో గత ప్రభుత్వం రహదారుల నిర్వహణను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. "గత ప్రభుత్వం కనీసం తట్టెడు మట్టి

- తరువాయి 2లో..

# మురుగప్ప 'ముప్పు'లో..మురిపాల కాకినాడ!

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :** గోదావరి నది గలగలలు, కోయిల కూతలు, ప్రశాంతమైన జీవనపు మురిపాలు.. అందుకే మన కాకినాడను ఎంతో ముద్దుగా 'విశ్రాంత జీవుల స్వర్గం' అని, 'ఆంధ్ర పారిస్' అని పిలుచుకుంటాం. అచ్చమైన తెలుగుదనానికి, స్వచ్ఛమైన గాలికి నిలయమైన ఈ నగరంపై ఇప్పుడు మురుగప్ప గ్రూప్‌కు చెందిన 'కోరమాండల్ అంతర్జాతీయ సంస్థ' విషపు నీడ కమ్ముకుంది. సుమారు రూ.5,000 కోట్ల భారీ పెట్టుబడితో, 30 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో మన నగర గుండెపై రసాయన గాట్లు పెడుతున్నారు. ఇది కేవలం విస్తరణ కాదు.. మన తర్వాతి తరం ప్రాణాలను నిశ్శబ్దంగా మింగేసే ఒక మహా వినాశనం!

**గత చేదు జ్ఞాపకాలు: గుర్తుందా ఆ హార్బర్ పేట ఘోష?**

మురుగప్ప యాజమాన్యం చరిత్ర చూస్తేనే భయమేస్తోంది. పదేళ్ల క్రితం ఇదే కర్మాగారంలో అమ్మోనియా గ్యాస్ లీక్ కావడంతో ఇద్దరు సీనియర్ అధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఆ నాడు హార్బర్ పేటలో సుమారు 50 మంది విషవాయువు పీల్చి ఆసుపత్రి పాలయ్యారు. ఆ గాయాలు ఇంకా పచ్చిగానే ఉండగానే, ఇప్పుడు మళ్ళీ రోజుకు 2,000 టన్నుల గంధకపు ఆమ్లం, 650 టన్నుల ఫాస్ఫోరిక్ ఆమ్లం ప్లాంట్లను జనవాసాల మధ్యకు తీసుకురావడం ఏ రకమైన అభివృద్ధి? ఇది కాకినాడను మరో భోపాల్ తరహా మృత్యుకుహరంగా మార్చే కుట్ర అని పర్యావరణ వేత్తలు మరియు సామాజిక విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**హరించుకుపోతున్న పచ్చదనం: చట్టాలకు పాతర!**

చెట్టు..అది మన ఊపిరి. పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం, ఇటువంటి భారీ పరిశ్రమల చుట్టూ 33 శాతం మేర దట్టమైన పచ్చదనం ఉండాలి. కానీ మురుగప్ప యాజమాన్యం లాభాల కక్కుర్తితో ఆ పచ్చదనాన్ని సమాధి చేసింది. నిబంధనల ప్రకారం గ్రీన్ బెల్టును పెంచాల్సింది పోయి, ఉన్న పచ్చదనాన్ని తొలగించి మరి ప్లాంట్ల నిర్మాణం చేపడుతున్నారు. అంటే మనకు ఆక్సిజన్ ఇచ్చే కవచాన్ని ముక్కలు చేసి, ఆ స్థానంలో విషపు పొగను నింపుతున్నారు.

**ఉత్పత్తి మొదలైతే .. పొంచి ఉన్న పెనుముప్పు!**

ఈ ప్లాంట్ ఒకసారి పూర్తిస్థాయి ఉత్పత్తిని ప్రారంభిస్తే, కాకినాడ ప్రజలు ఊహించని సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది:

– ఆమ్ల పొగమంచు

ప్లాంట్ నుండి వెలువడే వాయువులు గాలిలోని తేమతో కలిసినప్పుడు 'ఆమ్ల పొగమంచు' ఏర్పడుతుంది. దీనివల్ల క్యాన్సర్, శ్వాసకోశ వ్యాధులు పెరుగుతాయి.

– ఆరోగ్యంపై దాడి: ఇప్పటికే వాకలపూడి, సూర్యారావుపేట, వలసపాకల, రమణయ్యపేట, గొడారిగుంట ప్రాంతాల ప్రజలు శ్వాస సంబంధిత సమస్యలతో సతమతమవుతున్నారు.

– నీటి వనరుల కలుషితం: ప్లాంట్ వ్యర్థాలు భూగర్భ జలాల్లోకి చేరితే బావులు, చెరువులు విషతుల్యం అవుతాయి.

**ఉద్యోగ దగా – మొక్కుబడి సేవలు!**

స్థానికులకు ఉద్యోగాలిస్తామని ప్రగల్భాలు పలికే యాజమాన్యం, తీరా సమయం వచ్చేసరికి 'నైపుణ్యం లేదనే' సాకుతో మన వారిని కేవలం రోజువారీ వర్కర్లుగానే చూస్తోంది. కీలకమైన ఉద్యోగాల్లో ఇతర ప్రాంతాల వారికే పెద్దపీట వేస్తోంది. సీఎస్ఆర్ నిధులతో చేసే మొక్కుబడి పనులు, తక్కువ ఫీజుతో ఇచ్చే వైద్య సేవలు.. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి సంపాదించే కోట్ల రూపాయల లాభాల ముందు ఎంతో జుజ్జీ!

**అధికారులు ఈ తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్...**

– పనుల నిలిపివేత: గ్రీన్ బెల్ట్ నిబంధనలు అమలు చేసే వరకు విస్తరణ పనులను వెంటనే నిలిపివేయాలి.

– స్వతంత్ర విచారణ: జాతీయ స్థాయి పర్యావరణ సంస్థతో ఈ ప్రాజెక్ట్ వల్ల కలిగే ముప్పుపై 'భద్రతా తనిఖీ' చేయించాలి.

– నిజసమయ పర్యవేక్షణ: ప్లాంట్ పరిసరాల్లో గాలి నాణ్యతను తెలిపే బోర్డులను నగరం నడిబొడ్డున ఏర్పాటు చేయాలి.

**లాభం వాళ్లది – ప్రాణాలు మనవా?**

రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రకారం మనకు 'స్వేచ్ఛగా జీవించే హక్కు' ఉంది. మురుగప్ప గ్రూప్‌కు మనల్ని చంపే హక్కు ఎవరిచ్చారు? 30 లక్షల టన్నుల దిగుబడితో లాభాలన్నీ తమ ఖాతాల్లో వేసుకుంటూ, మన గాలిని విషం చేస్తున్న ఈ దహనకాండను మేధావులు గమనించాలి.

**రూ.5,000 కోట్ల పెట్టుబడి.. 30 లక్షల టన్నుల ఉత్పత్తి.. కాకినాడపై మురుగప్ప 'ఆమ్ల' కుట్ర!**

మురుగప్ప గ్రూప్ విసిరే చిల్లర కాసులు మన ఆయుష్షును కొనలేవు. స్మార్ట్ సిటీ కాకినాడ రూరల్, కాకినాడను మృత్యు నగరం కానివ్వొద్దు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఈ 'ఆమ్ల' ప్లాంట్లను అధికారులు తక్షణమే అడ్డుకోవాలని లక్షలాది మంది కాకినాడ గ్రామీణ, నగర ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసిన మోడీ ప్రభుత్వం



**మండవల్లి ,మేజర్ న్యూస్:** కేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005ను రద్దుచేసి, విబి–జి రామ్ జి 2025 పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకువచ్చి పని హక్కును రద్దుచేసి పేదల కడుపు కొట్టిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. శ్రీనివాస్ విమర్శించారు.

ఉపాధి హామీ చట్టం రక్షణకు సిపిఎం చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం మండవల్లి గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ విబిజి రామ్ జి చట్టం పూర్తిగా గ్రామీణ పేదలకు వ్యతిరేకమైనదని చెప్పారు. ఉపాధిని ఒక హక్కుగా కాకుండా ప్రభుత్వాల ప్రాయోజిత పథకంగా కేంద్రం మార్చి వేసిందన్నారు. గత చట్టంలో ఉండే 90 శాతం కేంద్ర ప్రభుత్వ వాటా నిధులను 60 శాతానికి కుదించిందని, 10 శాతంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల వాటాను 40 శాతానికి పెంచారని చెప్పారు. ఉపాధి పొందేందుకు గ్రామీణ పేదలకు ఉన్న హక్కును హరించి వేసి ఉపాధి హామీని ప్రభుత్వాలు ఇచ్చే బిక్ష కింద మార్చి వేయడం దారుణం మని విమర్శించారు.మహాత్మా గాంధీ పేరు స్థానంలో జి రామ్ జి పేరు మార్చడమే కాదని, మొత్తం చట్టం సారాన్ని నిర్వీర్యం చేసి పేద ప్రజల ఉపాధికే ఎసరు పెట్టిందన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# పుప్పాల కుటుంబం సేవలు ప్రశంసనీయం : డాక్టర్ రాజ్య లక్ష్మి



**నరసాపురం, మేజర్ న్యూస్ :** స్థానిక ఎంబర్ మన్నార్ స్వామి వారి దేవస్థానం వంశపారపర్యం ధర్మకర్త, విశ్రాంత రైల్వే అధికారి స్వర్గీయ పుప్పాల పానకాలరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు చేపట్టిన సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ సిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక 6వ వార్డులోని పానకాలరావు నివాసం లో ఏర్పాటు చేసిన సంవత్సరీక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పానకాలరావు 103 సంవత్సరాలు జీవించి ఎంతోమందికి సహాయపడ్డారన్నారు. ఆయన మరణానంతరం గడచిన ఏడాది కాలంలో వారి కుటుంబ సభ్యులు లక్షలాది రూపాయల వ్యయంతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. అనాథలకు, వృద్ధులకు, పేదలకు నిత్యావసరాలు, వస్త్రాలు పంపిణీ హెచ్ఐవి సోకిన చిన్నారులకు సైకిళ్ళు పంపిణీ, సర్వైకల్ క్యాన్సర్ గుర్తించిన పదిమందికి వ్యాక్సిన్ డోసులు,స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన పదవ తరగతి విద్యార్థులకు బహుమతులు తదితర 105సేవా కార్యక్రమాలను కుటుంబ సభ్యులు, యునైటెడ్ కాపు వనిత క్లబ్, లైన్స్ క్లబ్ ల సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని ఆమె అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సేవా కార్యక్రమాలను ముమ్మరం చేసి మరింత మందికి ఆదర్శనీయులు కావాలని రాజ్యలక్ష్మి పుప్పాల కుటుంబ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పొన్నాడ సుబ్రహ్మణ్యం,పద్మావతి, గంటా భాస్కరరావు, ఝాన్సీ, కమ్మిలి మురళి, పుప్పాల ఉషాకమల, సోదరీ సోదరీమణులు,పలువురు పాల్గొన్నారు.

## కాకినాడ నగరానికి ఆకర్షణీయమైన ముఖద్వారాలు

మొదటిపేజి తరువాయి

అవసరమైన చర్యలు చేపడతామని, స్మార్ట్ సిటీకి తగిన మౌలిక సదుపాయాలు, సుందరీకరణ పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కిటెక్ట్ చంద్రశేఖర్, నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, డీసీపీ కృష్ణారావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, ఈఈ ఆదినారాయణ, టీడీపీ నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, ఏఎంసీ చైర్మన్ బచ్చు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నిడదవోలు నియోజకవర్గంలో మంత్రి కందుల దుర్గేష్ సుడిగాలి పర్యటన

మొదటిపేజి తరువాయి

వేసిన పాపాన పోలేదు. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని రీతిలో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల కష్టాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో రహదారుల నిర్మాణాన్ని చేపట్టాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలను మంత్రి దుర్గేష్ వివరించారు. పల్లె పండుగ 1 మరియు 2 కార్యక్రమాల ద్వారా నియోజకవర్గంలో ఇప్పటికే 450 గ్రామీణ రహదారుల నిర్మాణం పూర్తిచేశామని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా మరో రూ.28 కోట్ల నిధులతో కొత్త రోడ్లకు అనుమతులు మంజూరయ్యాయి. వీటి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కానూరు–ఉసులుమర్రు రోడ్డును పెరవలి–కాపవరం వరకు పొడిగించే యోచనలో ఉన్నామన్నారు. అలాగే చివటం–ఉండ్రాజవరం రహదారుల కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిలతో చర్చించి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నిడదవోలు నియోజకవర్గాన్ని 'గుంతలు లేని రహదారుల' ప్రాంతంగా మార్చడమే తమ లక్ష్యమని మంత్రి దుర్గేష్ పునరుద్ఘాటించారు. కేవలం ప్రధాన రహదారులే కాకుండా లింక్ రోడ్లు, పుంత రోడ్లు మరియు డ్రైనేజీల వ్యవస్థను కూడా మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సంతృప్త స్థాయిలో అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలు ప్రారంభం

– సేవలు వినియోగించుకోవాలి

: వెటర్నరీ ఏడీ సాయి రమేష్



**భీమడోలు,మేజర్ న్యూస్:** ప్రభుత్వం చేపట్టిన ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాల సేవలను పాడి రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని భీమడోలు సబ్ డివిజన్ వెటర్నరీ ఏడీ డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ అన్నారు.సబ్ డివిజన్ వ్యాప్తంగా నేటి నుంచి ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలను సోమవారం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరాల్లో పశువులకు ఉచితంగా నట్టల నివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు.పశు సంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలపై, పశుభీమా పై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పశువుల ఆరోగ్యం మెరుగుపడితే పాడి ఉత్పత్తి పెరిగి రైతులకు ఆర్థిక లాభాలు చేకూరుతాయని వివరించారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని ఉంగుటూరు, నిడమర్రు, భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల పరిధిలోని పది పశు వైద్యశాలలు,4 ఆర్ఎల్ఎలలో, 65 ఆర్ఎస్‌కెలలో పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు అదేవిధంగా సబ్ డివిజన్ పరిధిలోని పలు జాతులు పశువుల సెన్సెక్స్ ను ఏడీ సాయిరమేష్ వివరించారు.

# వాడపల్లి గుడిలో నకిలీ టికెట్ల స్కాంపై విచారణ జరపాలి

- ఒకరి మీద ఎఫ్ఐఆర్ వేసి మిగతా వాళ్ళని దాచటం వెనుక ఉన్నా ఆంతర్యం ఏమిటో చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే చిర్ల



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** భక్తుల మనోభావం దెబ్బతీసే విధంగా వాడపల్లి ప్రతిష్టను దెబ్బతీస్తుంటే సనాతన వాదులు ఏమైపోయారు అంటూ మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల పేరుతో కూటమి దోపిడీకి పాల్పడిందని ప్రభుత్వం నుంచి వచ్చింది ఎంత చందాల నుంచి వచ్చింది ఎంత ప్రజలకు లెక్క చెప్పవలసిన అవసరం లేదా అని ఆయన ప్రశ్నించారు. అలాగే ఆత్రేయపురం సంక్రాంతి సంబరాల్లో ప్రోటోకాల్ పాటించలేదని, నాయకుల మెప్పు కోసం అధికారులు పరితపించారు తప్ప ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు విస్మరించారని విమర్శించారు.వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం కూటమి ప్రభుత్వం దోపిడీకి అడ్డాగా మారిందని దీనితో వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ ప్రతిష్ఠను కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తుందని అన్నారు. నకిలీ టికెట్ల వివాదంలో ఒకరి మీద ఎఫ్ఐఆర్ వేసి మిగతా వాళ్లను కాపాడడంపై మీ ఉద్దేశం ఏమిటి అని, ఆ నకిలీ టిక్కెట్ల వివాదంపై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినేలాగా కూటమి చర్యలు చేస్తుంటే సనాతనవాదులమంటూ చెప్పుకుని తిరిగే పవన్ కళ్యాణ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం జడ్పిటిసి కుడుపూడి శ్రీనివాస్, మన్యం భాను, తమ్మన శ్రీనివాస్, కోణాల రాజ్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద కుటుంబానికి జమాల్ ఖాన్ చేయూత




ఎటపాక, మేజర్ న్యూస్ : పోలవరం (రంపచోడవరం) జిల్లా ఎటపాక మండలం నల్లకుంట పంచాయతీ పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన కుటుంబం కొర్రి బాబు, అనూష ఇల్లు ప్రమాద వశాత్తూ శనివారం అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధం అయ్యింది. బాధిత కుటుంబానికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, జే.కే.సి. ట్రస్టు చైర్మన్, తెలుగుదేశం పార్టీ చింతూరు మండల అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ సోమవారం అగ్ని ప్రమాదం జరిగిన స్థలాని సందర్శించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆ కుటుంబానికి ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇనుప పైపులు, సిమెంట్ రేకులు, 2 రగ్గులు, 30 కేజీల బియ్యం అందజేశారు. బాధితుల కదనం ప్రకారం భార్య భర్త ఇద్దరు పొలం పనులకు వెళ్ళినారు. చిన్న పిల్లలు పక్క ఇంట్లో ఆడుకుంటున్నారు. ఆ సమయంలో ఆకస్మికంగా ఇంట్లో నుంచి మంటలు ఎగసి పడుతుండటంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారనీ, ఈ లోగా పూర్తిగా సామగ్రి, కొంత నగదు సైతం ఇంట్లో ఉన్నాయని, పూర్తిగా కాలి బూడిద అయ్యాయని బాధితులు జమాల్‌ఖాన్ ముందు వాపోయారు. కట్టు బట్టలతో మిగులామని ఆవేదన చెందరు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు కణితి మధు, స్థానిక గ్రామ పెద్దలు కొమరం నాగేశ్వరరావు, సొంది దుర్గారావు, ఉయ్కు నాగేశ్వరరావు, తెల్లం అనంత బాబు, పోడియం శ్రీను, మాజీ ఎం పి.టి సి.పంద్రం కాంతమ్మ, మడకం సత్యం, శీలం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి దుర్గేష్

**పెరవలి, మేజర్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గానికి సంబంధించి పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు జనవరి 19వ తేదీ సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న 35 మంది బాధితులకు రూ.22,07,999 లను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి దుర్గేష్ లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు సంబంధించిన జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# వెంకన్న సన్నిధిలో ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు





- నిత్య అన్నదాన పథకానికి విరాళం

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని ముమ్మిడివరం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.నిత్యాన్నదాన పథకానికి తాడేపల్లి గూడెం మండలం కృష్ణయ్యపాలెంకు చెందిన రెడ్డి గోపాలం, సుబ్బమ్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.50,116లు విరాళంగా అందించారు. వీరికి అర్చకులు స్వామివారి దర్శనం చేయించి స్వామి చరిత్ర గురించి వివరించారు. స్వామి వారి చిత్రపటాన్ని అందించారు.

## ఘనంగా ప్రజాకవి యోగివేమన జయంతి వేడుకలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచిన అభ్యుదయ వాది, ప్రజాకవి, సంఘసంస్కర్త వేమన తెలుగు ప్రజల మనసుల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచే ఉంటారని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. సోమవారం ప్రజాకవి యోగివేమన జయంతిని పురస్కరించుకుని జిల్లా యువజన సర్వీసుల శాఖ సెట్రాజ్ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్ఓ వెంకటరావు, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, కె.శ్రీరమణి తదితరులు వేమన చిత్ర పటానికి పూలమాలలు అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవులను సన్మార్గంలో నడిచేందుకు వేమన రచించిన పద్యాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. వేమన పద్యాలు తెలుగు సాహిత్య లోకంలో సరికొత్త వరవడిన తీసుకువచ్చాయన్నారు. తన రచనా నైపుణ్యంతో సమాజాన్ని చైతన్యపరిచిన అభ్యుదయవాది, ప్రజాకవి, సంఘసంస్కర్త వేమన తెలుగు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటారన్నారు. మత విశ్వాసాలు, మూఢ నమ్మకాలను నిరసిస్తూ సమానత్వం, నైతిక, మానవత్వ విలువలను తన పద్య రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన మహనీయుడు యోగివేమన అని ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ కొనియాడారు.

కార్యక్రమంలో సెట్రాజ్ సీఈవో కె.ఎస్.వి.కాశీ విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఏవో ఎస్.రామ్మోహన్ రావు, సెట్రాజ్ సిబ్బంది గౌతమ్ కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రెటరీలు



**రావులపాలెం, మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్తపేట నియోజకవర్గంనకు చెందిన ఇద్దరు అడ్వకేట్లు రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీలుగా నియమింపబడ్డారు. వీరు కర్రి వెంకట గోవింద కృష్ణారెడ్డి మరియు బొక్కా నందిని శివ కళ్యాణి నాగేశ్వరరావు లు సోమవారం రావులపాలెం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయం నందు జగ్గిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జగ్గిరెడ్డి వారిని పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానము, అన్నవరం**



ఆర్.సి. నెం: ఎఫ్1/49274/2025 , తేది. 19.01.2026

**ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

శ్రీ స్వామివారి దేవస్థానము నందు వివిధ సివిల్ వర్క్ కొరకు ఈ-టెండరులు కోరబడుచున్నవి. మిగిలిన వివరముల కొరకు **www.tender.apeprocurement.gov.in** నందు చూడవచ్చును. మరిన్ని వివరముల కొరకు ఫోన్ నెం. 9171456789, 9948188123, 9247296699, 8374445065 సంప్రదించండి.

**వేండ్ర త్రినాథరావు,**
జాయింట్ కమిషనరు & ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు
శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానము, అన్నవరం.

సూర్య
www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

– అధికారులకు అపూర్వభరత్ ఆదేశం



కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలలో అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్.. జీజీహెచ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎన్.శ్రీధర్, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో పీ.త్రినాథ్, డీఎల్డీఓ పి.వాసుదేవరావు తదితర అధికారులతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయన ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం వంటి అంశాలపై మొత్తం 268 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రజా సమస్యలపై అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అదేవిధంగా రెవెన్యూ శాఖలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అందిన అర్జీలపై క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రజలకు సంతృప్తికరమైన పరిష్కారాలు ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ క్లినిక్‌కు 73 అర్జీలు..** రెవిన్యూ అంశాల పరిష్కారం నిమిత్తం సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వివేకానంద హాలు పైన నిర్వహించిన రెవిన్యూ క్లినిక్ కార్యక్రమంలో డీఆర్వో వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, కె.శ్రీరమణి ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే, భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, 22ఏలోని భూములు, సర్వే నెంబర్లు ఇతర రెవెన్యూ అంశాలపై మొత్తం 73 అర్జీలు అందాయని డీఆర్వో వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెకటరావు.. రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లతో అర్జీల పరిష్కార పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

# ‘శ్రీ అక్షర’లో అక్షరాభ్యాస మహోత్సవం

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో గల శ్రీ అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ఈ నెల 23వ తేదిన శుక్రవారం ఉదయం 9.29 ని.లకు స్వస్తి శ్రీ ఛాంద్రమాన విశ్వావసు నామ సంవత్సర మాఘ శుద్ధ పంచమి పూర్వాభాద్ర నక్షత్ర యుక్త లగ్నమందు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించబడునని స్కూల్ కరస్పాండెంట్ నూకలమంతి పద్మారావు తెలిపారు. పలక బలపం ఈ అక్షరాభ్యాసంలో పాల్గొనే విద్యార్థులకు



ఉచితంగా ఇవ్వబడునని, 23వ తేది నుండి 30-4-2026 వరకు స్కూల్ నందు పలక, బలపం లేకుండా ఆట పాటలతో డిజిటల్ క్లాస్ రూమ్‌లో మూడు నెలల పాటు ఉచితంగా శిశు వాటిక తరగతులు నిర్వహించబడునని, కావున పిల్లల తల్లితండ్రులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని, తమ పిల్లలచే అక్షరాభ్యాసం చేయించుకునే తల్లితండ్రులు 20-1-2026 నుండి పేర్లు నమోదు చేయించవల సినదిగా పద్మారావు కోరారు.

# వ్యాపారస్తులకు ఉద్యమం రిజిస్ట్రేషన్

అడ్డతీగల, మేజర్ న్యూస్ : ఏజెన్సీ అడ్డతీగల మండల పరిధిలోని 99 గ్రామాలలో పెద్ద చిన్న వ్యాపారాలు చేస్తున్న ప్రతి ఒక్కరు ఉద్యమం పోర్టల్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా అనేక ప్రభుత్వ రాయితీలు పొందవచ్చు అని అడ్డతీగల ఎంపీడీవో కుమార్ అన్నారు . అందుకోసం వ్యాపారస్తులకు ఈనెల 21వ తేదీ బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం నందు వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని తద్వారా అర్హులైన వ్యాపారస్తులకు ఉద్యమం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఇందుకోసం వ్యాపారస్తులు తమ ఆధార్ కార్డు ఆధార్‌తో లింక్ అయిన ఫోను నెంబర్ బ్యాంకు ఖాతా వివరాలు పాన్ కార్డ్ వ్యాపారం వివరాలు అడ్రస్సు లతో వచ్చి ఉద్యమం రిజిస్ట్రేషన్ పొందాలని సూచించారు . దీనివల్ల ప్రభుత్వం కల్పించే రాయితీలతో పాటు అతి తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు పొందే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

# ప్రజల సహకారంతోనే ‘సమస్యల రహిత కాకినాడ’ నగర నిర్మాణం

– నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ నగరాన్ని సమస్యల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని కాకినాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆయన కాకినాడ నగరంలోని 9వ డివిజన్ పల్లంరాజునగర్‌లో పవన్ గార్డెన్స్ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ ప్రాంతంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం పరిసరాలు, పార్కులు, అలాగే ఆ ప్రాంతంలోని పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆయన పరిశీలించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో డ్రైనేజీపై ఏర్పాటు చేసిన రాళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని గుర్తించిన ఇంచార్జ్ కమిషనర్, వాటి స్థానంలో వెంటనే కొత్త రాళ్లు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కాలనీ వాసులు ముందుకు వచ్చి తమ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజలు చొరవ చూపినప్పుడే సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. అనంతరం స్థానికులను పలకరించి పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, కాకినాడ నగరాన్ని సమస్యల రహిత నగరంగా, క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు నగరపాలక సంస్థ అధికారులకు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. నగర అభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వాములుగా మారాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటేషన్ సూపర్‌వైజర్ నాయుడు, ఏఈ రత్నమాల, శానిటేషన్ ఇన్స్పెక్టర్ సుదర్శన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలి

– అధికారులకు జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆదేశం



కాకినాడ, మేజర్ న్యూస్ : జిల్లాలోని వివిధ సంక్షేమ వసతి గృహాలు, ఇతర ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు ఇతర మెరుగైన మౌలిక వసతుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు ఇతర మౌలిక వసతులు ఏర్పాటుపై జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్.. విద్యాశాఖ అధికారులు ఆయా సంక్షేమ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, ఇతర ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన సురక్షిత మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. వసతి గృహాల్లో అందుబాటులో ఉన్న వనరులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు వేడి నీరు (హాట్ వాటర్) అందించేలా తగు ఏర్పాటు చేయాలన్నారు. రానున్న పరీక్ష కాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను ఇప్పటినుంచే ప్రణాళిక ప్రకారం సన్నద్ధం చేయాలని ఆయన స్పష్టం చేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, మరమత్తులు, కాంపౌండ్ వాల్ నిర్మాణం వంటి అంశాలపై ఈ నెల చివరినాటికి నివేదిక సమర్పించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, ఇన్చార్జ్ బీసీ సంక్షేమ అధికారి జి.శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ వెంకటపతి రాజు, ఆయా సంక్షేమ వసతి గృహాల ప్రిన్సిపాల్స్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలపై స్పష్టమైన అవగాహన

– సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ నగరంలో ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలపై సమగ్ర అవగాహన ఏర్పడిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇన్చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని, ప్రజాదర్బార్ నిర్వహణపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల వద్దకే వెళ్లి నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 4,126 వివిధ రకాల అర్జీలు స్వీకరించామని తెలిపారు. ముఖ్యంగా పెన్షన్లు, ఇళ్ల పట్టాలు, ఇతర ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాలపై వచ్చిన అర్జీల ఆధారంగా ఒక సమగ్ర నివేదిక రూపొందించామన్నారు. ప్రజాదర్బార్ ద్వారా అధికారులకు ప్రజల అవసరాలు, సమస్యలపై స్పష్టమైన అవగాహన ఏర్పడిందని, అలాగే ప్రజా అవసరాలపై కూడా సమగ్ర దృక్పథం కలిగిందన్నారు. ఇకపై ప్రతి డివిజన్‌పై పూర్తి అవగాహన కోసం ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ఒక డివిజన్ చొప్పున పర్యటనలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాదిలో కాకినాడ నగరాన్ని సమస్యల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి డివిజన్ అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమి షనర్ కె.టి. సుధాకర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఎస్.ఈ. పి. వెంకట్రావు, టీపీఆర్వో శైలజ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**– పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన గ్రామాలకు సంబంధించిన సమస్యలపై గ్రీవెన్స్‌లో ప్రజలు నుండి వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ అదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఏ సమావేశం హాలులో వివిధ శాఖల అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఈ వారం వివిధ సమస్యలపై సుమారు 37 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. తుని మండలం తేటగుంట గ్రామంలో 190 మంది కొండదొర ఎస్టీ కులస్తులు ఉన్నారని, తమ ఎస్టీ కులస్తులకు ఐటీడీఏ ద్వారా అభివృద్ధి చేయాలని, అదేవిధంగా 11 మంది గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని పిట్టల రాజు, రుప్పుల శ్రీను, పిట్టల లోవరాజు దరఖాస్తు సమర్పించారు. అడ్డతీగల మండలం దొరమామిడి పంచాయతీలోని కినపర్తి గ్రామంలోని 12 కుటుంబాలకు కరెంటు సౌకర్యం ఏర్పాటు చేయాలని డిప్పల చిన్నబ్బాయి, మర్రి రాంబాబు, డిప్పల శ్రీను దరఖాస్తు సమర్పించారు. దేవీపట్నం మండలం పాముగండి గ్రామ సమీపంలో రహదారి బాగోలేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గజ్జలమ్మ గుడి రహదారి మరమ్మతులు చేయించాలని కోసు లచ్చన్న దొర దరఖాస్తు సమర్పించారు. దేవీపట్నం మండలం పోలవరం ప్రాజెక్టులో ముంపుకు గురైన ముసినిగుంట ఆర్ అండ్ ఆర్ బాధితులకు ల్యాండ్ టు ల్యాండ్ గిరిజనులకు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా పూర్తిస్థాయిలో త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని మిర్తివాడ వీరబాబు, ఎస్.వెంకన్న దొర, ఎస్ కృష్ణ దరఖాస్తు సమర్పించారు. ఇంకా అనేక సమస్యల పై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఎపీఓ జనరల్ డి.ఎన్.వి.రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనా అధికారి యం.సావిత్రి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, డిఎల్డివో, జిల్లా పంచాయతీ అధికారి కె.కోటేశ్వరరావు, ఎడీఏలు సావిత్రి, రామ్మోహన్, పిహెచ్ఓ దేవదానం, జిసిసి డిఎం జయశ్రీ, పిఏఓ ఎల్. రాంబాబు, తహసిల్దార్ పి.బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, ఏటిఓ బి.జగన్, సిడిపివోలు క్రాంతి కుమారి, లక్ష్మి, కె.ఉమా, శాంతి కుమారి, ఈఈలు బి.వి. రమణ, సుబ్బయ్య, రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకటరమణ, శివ, మల్లికార్జునరావు, సుబ్బారావు, భవానీ, ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ సూర్యప్రకాశ్రావు, డాక్టర్ శ్వేత, డాక్టర్ స్పందన, పలువురు తాసిల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ తహసిల్దార్లు రవీంద్రబాబు, స్వామి, సబ్ రిజిస్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

# జనసేన ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

**– పోలీసులకు ఫిర్యాదు చేసిన జనసేన నాయకులు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** జనసేన ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు పిఠాపురం పట్టణ ఎస్సై మణికుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సంక్రాంతి సందర్భంగా జనసేన నాయకులు పిఠాపురం మండలం చిత్రాడ గ్రామ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన జనసేన పార్టీ ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి చించివేయడం జరిగిందన్నారు. ప్రశాంతంగా అన్నద మ్ముల్లా కలిసి ఉండే మేము ఇటువంటి సంఘటన వల్ల మా చిత్రాడ గ్రామంలో లేనిపోని మనస్పర్థలు, గొడవలు పెట్టుకునే పరిస్థితులు వస్తున్నాయని, ఇటువంటి సంఘటనలు మళ్ళీ మరెక్కడా జరగకుండా చూడవలసిందిగా కోరుతూ... పిఠాపురం పట్టణ ఎస్సై కు వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ వెల్ఫేర్ మరియు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, గ్రామ కమిటీ ప్రెసిడెంట్ నంద్యాల జాన్, గ్రామ వైస్ ప్రెసిడెంట్ దేశిరెడ్డి సతీష్, దూలపల్లి నాగబాబు, వార్డ్ ఇన్చార్జిలు కొట్టేల రాంప్రసాద్, పండు, గాది వెంకటేష్, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో భూసమస్యల పరిష్కారానికి చర్యలు





**– పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం (రంపచోడవరం) జిల్లా పరిధిలో ఏజెన్సీ ప్రాంత గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం ఇన్చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం సమావేశం హాలులో రెవెన్యూ సమస్యలు, భూ సమస్యలు, కొత్త డి పట్టాలు సమస్యలు, భూ సేకరణ, వెబ్ లాండ్ సమస్యలకు సంబంధించి కౌంట ర్లలో దరఖాస్తులు సమర్పించిన వాటిని వేగవంతంగా పరిష్కరించాలని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ పోలవరం జిల్లా రంపచోడవరంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ సమస్యలపై మొత్తం 3 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. ప్రతీ సమస్యకు సంబంధించి దరఖాస్తులు జిల్లా పరిధిలోని ఆయా మండలాల తహసిల్దారులకు పంపి ప్రభుత్వ నిబంధనలు ప్రకారం సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతీవారం రెవెన్యూ శాఖకు వచ్చిన సమస్యల దరఖాస్తులు ఎన్ని పరిష్కరించినవి, అదేవిధంగా ఇంకా ఎన్ని దరఖాస్తులు పరిష్కరించవలసి ఉన్నది సంబంధిత అధికారులతో సంప్రదించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కాగా ఈనెల 26వ తేదీన రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా నూతన పోలవరం జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించాలని, అదేవిధంగా కొన్ని ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేసే విధంగా సంబంధిత అధికారులతో చర్చించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివా సరావు, ఐటీడీఏ ఎపిఓ జనరల్ డి.ఎన్.వి. రమణ, సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనా అధికారిని ఎం.సావిత్రి, డిప్యూటీ తహసిల్దార్లు సరిత, శ్రీధర్, శివ, విలేజ్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# భేటి బచావో.. భేటి పడావో పై అవగాహన కార్యక్రమం




**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండల కేంద్రంలో జనవరి 19వ తేదీ సోమవారం స్థానిక అంగన్వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో భేటీ బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. పెరవలి సిడిపిఓ ఆశా రోహిణి ఆదేశాల మేరకు ఐసిడి సూపర్వైజర్ ఎండి హసీనా ఈ కార్యక్రమాన్ని పెరవలి ఎంపీపీ స్కూల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్యవివాహాలు వల్ల జరిగే అనర్ధాలు గురించి బేటి బచావో బేటి పడావో గురించి పౌష్టికాహారం గురించి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమానికి అంగన్వాడి కార్యకర్తలు, స్కూలు టీచర్లు హాజరయ్యారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక భరోసా

**– రూ.18 లక్షల విలువైన చెక్కులు పంపిణీ**



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన నిరుపేదలకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక భరోసా కల్పిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బండారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ అనేది పేదలకు అందని ద్రాక్షగా ఉండేదన్నారు. తమకు కావలసినవారికి మాత్రమే రిలీఫ్ ఫండ్ అందజేసేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలందరికీ మేలు జరుగుతుందన్నారు. అటు ఎన్టీఆర్ ఆరోగ్య సేవ, ఇటు ఇన్సూరెన్స్ కవర్ కాని రోగులకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గానికి చెందిన 17 మందికి రూ.18,17,911 విలువచేసే చెక్కులను ఆయన అందజేశారు.

## బడ్జెట్ ఫైనాన్స్ అంశాలపై చక్కటి అవగాహన కలిగింది

**– శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్**



**పెరవలి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర బడ్జెట్, ఫైనాన్స్ అంశాలపై న్యూ ఢిల్లీలో జరుగుతున్న జాతీయ సదస్సులో పాల్గొనడం ద్వారా చక్కటి అవగాహన కలిగిందని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. జనవరి 19వ తేదీ సోమవారం న్యూఢిల్లీలో రెండు రోజులు పాటు జరుగుతున్న వర్క్ షాప్‌లో పాల్గొన్న రవీంద్రనాథ్ అక్కడ విశేషాలను మేజర్ న్యూస్‌తో పంచుకున్నారు. ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో జనవరి 19 వ తేదీ 20 వ తేదీ లలో జరుగుతున్న ఈ వర్క్ షాప్‌లో వివిధ రాష్ట్రాల నుండి శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు పాల్గొన్నారు అని తనకు ఈ సమావేశంలో పాల్గొనే అవకాశం లభించినందుకు సంతోషంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలలో ఆర్థిక విధా నాలు, ప్రజా పద్దుల ప్రాముఖ్యత, కేంద్ర రాష్ట్ర ఆర్థిక సంబంధాలు, కేంద్ర ప్రభుత్వ స్కీమ్స్ రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై వర్క్ షాప్ జరిగింది అన్నారు. ఈ సమావేశాలలో దేశవ్యాప్తంగా పేరెన్నికగన్న డాక్టర్ మనీష్ గుప్తా, అసోసియేట్ ప్రొఫెసర్, జాతీయ ఆర్థిక సంస్థ, తన్వీ గుప్త జైన్, చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ యుబిఎస్, డాక్టర్ కార్తీక్ మురళీధరన్, ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా స్పీకర్స్ పాల్గొన్నారన్నారు.

# గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల వేగవంతానికి ఆదేశాలు

**- డీడబ్ల్యూఎస్ఎం సమావేశంలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై.మేఘా స్వరూప్**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను మరింత వేగవంతం చేయాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా నీరు మరియు పారిశుద్ధ్య మిషన్ (డబ్ల్యూఎస్ఎం) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ), వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు, జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనుల పురోగతిని సమీక్షించారు. గ్రామ సచివాలయాలలో యూనిట్ వ్యయం రూ.3 లక్షలతో మంజూరు చేసిన 195 కమ్యూనిటీ సానిటేషన్ కాంప్లెక్సుల్లో 185 పూర్తయ్యాయని, ఐదు పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. పర్యాటక ప్రాంతాలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు తదితర ప్రాంతాలలో మంజూరు చేసిన కమ్యూనిటీ సానిటేషన్ యూనిట్లలో కొన్నింటి పనులు కొనసాగుతున్నాయని, మరికొన్ని ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మంజూరు చేసిన యూనిట్లలో నాలుగు మాత్రమే ప్రారంభ మయ్యాయని పేర్కొన్నారు. వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల నిర్మాణంపై సమీక్షలో భాగంగా జిల్లాలో 1016 మంది లబ్ధిదారులకు అనుమతి ఇవ్వగా, క్షేత్రస్థాయి పరిస్థితుల దృష్ట్యా 267 మందిని తొలగించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 579 మరుగుదొడ్లు పూర్తయ్యాయని, 113 పురోగతిలో ఉన్నాయని, 57 ప్రారంభం కాలేదని అధికారులు తెలిపారు.

వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులపై చర్చ సందర్భంగా తూర్పు డెల్టా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును రూ.1650 కోట్ల అంచనా వ్యయంతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ధవళేశ్వరం గ్రామంలో హెడ్‌వర్క్స్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తయ్యిందని, ఇంటెక్ వెల్ కోసం భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అలాగే వెస్ట్రన్ డెల్టా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును రూ.1400 కోట్ల వ్యయంతో అమలు చేస్తున్నామని, కొవ్వూరు మండలం మద్దూరు, వాడపల్లి గ్రామాలలో భూసంబంధిత ప్రక్రియలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. గ్రామీణ స్థాయిలో నీటి సరఫరా కమిటీలు (ఎస్‌బీసీ) చురుకుగా పనిచేయాలని, జల్ జీవన్ మిషన్ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలకు నిరంతర, సురక్షిత తాగునీరు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి, జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి ఎస్.ఈ. బీవీ గిరి, నియోజకవర్గ, మండల ప్రత్యేకఅధికారులు,తహశీల్దార్లు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి ఉత్సవాలకు పందిరి రాట

**- ఫిబ్రవరి 13 నుండి 18 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు**



**పిఠాపురం, మేజర్‌న్యూస్ :** మహాశివరాత్రి- 2026లో భాగంగా ఫిబ్రవరి 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మహాశివరాత్రికి సంబంధించిన పనులు మొదలు పెట్టుటకు శ్రీ కుక్కుటేశ్వర స్వామివారి దేవస్థానం నందు పందిరి రాట కార్యక్రమం సోమవారం వైభవ ంగా నిర్వహించారు. మహా శివరాత్రి-2026లో భాగంగా శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణం ది.13.02.2026, ది.15.02.2026 న మహాశివరాత్రి, ది.16.02.2026 న రథోత్సవం, ది.18.02.2026న శ్రీపుష్పోత్సవం జరుగుతుందని తెలిపారు.

సదరు పందిరి రాట కార్యక్రమం బ్రహ్మశ్రీ ద్విభాష్యం సుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కోట దత్తాత్రేయ శర్మ, కైతేపల్లి రాజకుమార్ శర్మ, కోట విశ్వనాథ శర్మ, కోట ఫణి శర్మ, కామేష్ శర్మ, పండితులు విజయమూరి సుబ్రహ్మణ్య శర్మ, అల్లంరాజు చంద్రమౌళిచే జరిపించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహ ణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ బొల్లం వీరభద్రరావు, ఆలయ సిబ్బంది రెడ్డం ప్రసాద్, కొప్పిశెట్టి దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

# కోట రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిట



**సామర్లకోట,మేజర్‌న్యూస్:** సంక్రాంతి సంబరాలు ముగియడంతో సొంతూళ్ల నుంచి నగరాలకు ప్రజల తిరుగు ప్రయాణంతో సామర్లకోట బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ పరిసరాలు ప్రయాణి కులతో సోమవారం కిక్కిరిసిన వాతావరణం నెలకొంది. రద్దీని తగ్గించేందుకు ఆర్టీసీ, రైల్వే ప్రత్యేక సర్వీసులు నడిపిన ప్రయాణికుల తీవ్ర ఇక్కట్లు మాత్రం తప్పలేదు. మూడు రోజుల పాటు అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు శుక్రవారం కనుమ పండుగతో ఘనంగా ముగిసినా శని, ఆదివారం సెలవు రావడంతో కొందరు ప్రయాణికులు రిజర్వేషన్లు తదితర కారణాలతో సోమవారం సైతం ప్రయాణాలను ఏర్పాటు చేసుకోవడంతో బస్టాండు రైల్వేస్టేషన్లో రద్దీ వాతావరణం కనబడుతుంది.

# పీజీఆర్ఎస్ ద్వారా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

**- పాడా పీడీ శ్రీనివాసరావు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని పాడా పీడీ శ్రీనివాసరావు అధి కారులను ఆదేశించారు. పిఠాపురం ఏరియా డవలప్మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాడా పీడీ శ్రీనివాసరావు పాల్గొని, పిఠాపురం పరిసర ప్రాంతాల ప్రజలు నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ అంశాలపై 32 అర్జీలు అందాయన్నారు. ఇందులో రెవెన్యూ-8, మునిసిపాలిటీ-14, ఇతరములు-7, మరియు ఆఫ్లైన్ అప్లికేషన్స్-3 వచ్చాయని తెలిపారు. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వసంత మాధవి మరియు మునిసిపల్ కమీషనర్లు, వివిధ శాఖల పాల్గొన్నారు.

# ఆర్.డబ్ల్యూ.ఎస్. జెఇగా గంగాధరరావు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండల ఆర్.డబ్ల్యూ. ఎస్. జెఇగా పి.గంగాధరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన కాకినాడ సబ్ డివిజన్ (ఆర్. డబ్ల్యూ.ఎస్) ప్రాజెక్ట్ నుండి పెద్దా పురం జెఇగా రావడం జరిగింది. ఇప్పటివరకు ఇక్కడ జెఇగా పనిచేసిన శ్రీరామ్ కాకినాడ సబ్ డివిజన్ ప్రాజెక్టుకు వెళ్ళడం జరిగింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గంగాధరరావు ఆర్.డబ్ల్యూ.ఎస్ డి.ఇ. ఎం.ఎస్.స్వామిని, ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణని, డిప్యూటీ ఎంపిడిఓ జి.శేఖరరెడ్డిలను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# యోగి వేమన బోధనలు నేటికీ దారి చూపుతున్నాయి

**- వేమన జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఘన నివాళులు**
**- ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జనవరి 18న యోగి వేమన జయంతిని పురస్కరించుకుని సోమవారం రాజమహేంద్రవరం లోని జిల్లా కలెక్టరేట్‌లో యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ (ఎఫ్ఏసీ) / జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ పాల్గొని వేమన సందేశాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వేమన పద్యాలు తెలుగు ప్రజల జీవితంలో ఒక భాగమని, అవి సులభంగా అర్థమయ్యేలా ఉండటంతో నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అందుకే వేమన బోధనలు కాలాతీతంగా నిలిచిపోయాయని అన్నారు. ఈ సందర్భంగా యోగి వేమన పద్యాన్ని పలువురు విద్యార్థులు ఆలపించడం జరిగింది. మన ఆలోచనలు మంచిగా ఉంటే, మన కార్యాచరణ కూడా మంచిగా ఉంటుందని, నిజాయితీతో పనిచేస్తే మంచి ఫలితాలు తప్పక లభిస్తాయని వేమన బోధనలు వివరించారు. ఇది ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరికీ అనుసరణీయమైన బోధన అని తెలిపారు. యోగి వేమన గొప్పతనాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన సీపీ బ్రౌన్ సేవలు మరువలేనివని, మన భాష, సంస్కృతి విలువలను ప్రపంచం గుర్తించడం గర్వకారణమని ఇంచార్జి జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వేమన పద్యాలు, సూక్తులు భావితరాలకు చేరేలా చూడటం మన అందరి బాధ్యత అని, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నవారు వేమన బోధనలను తమ ఉద్యోగ బాధ్యతల్లో అమలు చేయాలని సూచించారు. నిజాయితీతో విధులు నిర్వహించడం, ప్రజల పట్ల సేవాభావంతో పని చేయడమే వేమనకు అర్పించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ పి. శ్రీనివాస్ రావు, సత్యసాయి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గురువా రెడ్డి, పాఠశాల విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రసూతి వైద్యులను నియమించండి



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ మండల కేంద్రమైన అడ్డతీగలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో నేటికీ ప్రసూతి వైద్యులు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబురావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆస్పత్రిలో సకల సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రసవ వేదనతో వచ్చే నిరుపేద గర్భిణీ స్త్రీలకు ప్రసూతి వైద్యురాలు లేని లోటు కనిపిస్తుందని విమర్శించారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రసూతి వైద్యురాలను నియమించాలని సోమవారం డిమాండ్ చేస్తూ రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారికి వినతి పత్రం అందజేశారు.

# వరుపుల తమ్మయ్య బాబు విగ్రహావిష్కరణ



ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించే వరుపుల తమ్మయ్య బాబు మన మధ్య లేకపోవడం దురదృష్టకరమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఇటీవల మృతి చెందిన ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన నేత వరుపుల తమ్మయ్య బాబు దశదిన సందర్భంగా ఏర్పాటుచేసిన విగ్రహాన్ని సోమవారం లింగంపర్తి గ్రామంలో పలువు రాజకీయ ప్రముఖులు, కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ తమ్మయ్య బాబు నిరంతరం ప్రజలతో మమేకమై కష్టం వచ్చిన వారి వెంట వెన్నుదన్నుగా నిలబడే వ్యక్తి గా పేరుపొందారున్నారు. కష్టాల్లో ఉన్న వారికి ఎలాంటి సహాయమైనా అందించేందుకు తమ్మయ్య బాబు ముందు ఉండడం తమ కుటుంబానికే గర్వకారణం అన్నారు. అలాంటి మంచి మనసు గల వ్యక్తిని కోల్పోవడం దురదృష్టకరంగా దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యులతో పాటు పార్టీలకతీతంగా పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ్మయ్య బాబు కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ తుమ్మల బాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరపుల సత్య ప్రభ రాజా, వైకాపా నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు, తెలుగుదేశం నేత జ్యోతుల నవీన్, జ్యోతుల పెదబాబు, బొదిరెడ్డి గోపాలకృష్ణ, పైల సుభాష్ చంద్రబోస్ లతోపాటు బంధువులు అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఈ నెల 23న బహిరంగ వేలం

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : విస్తరణ శిక్షణా కేంద్రం సామర్లకోట నందు గల ప్రభుత్వ వాహనం ఎ.పి. 05సి.సి.9218 షిఫ్ట్ డిజైర్ 2012 మోడల్ కార్‌ను ఈ నెల 23వ తేదిన ఉదయం 11 గంటలకు విస్తరణ కేంద్రం, సామర్లకోట కార్యాలయం నందు బహిరంగ వేలంను టెండర్ విధానంతో కలిపి నిర్వహించుటకు అకడమిక్ కౌన్సిల్ నిర్ణయించినట్లు విస్తరణ కేంద్రం ప్రిన్సిపల్ కె.ఎన్.వి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆశక్తి గల వారు రూ. 18వేలు డిపాజిట్‌గా నగదు రూపంలో చెల్లించి, వేలం నందు పాల్గొనుటకు అవకాశం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. ఇతర సమాచారం కొరకు విస్తరణ శిక్షణా కేంద్రం సామర్లకోట నందు కార్యాలయం పనిచేయు వేళలో (ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల లోపు) సంప్రదించాలని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

# అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**– అర్జీలు పరిష్కార తీరు పారదర్శకంగా, నాణ్యతతో ఉండాలి**

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి యం.సుజాత సూచించారు. సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందజేసిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కార సరళిపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు క్షేత్ర స్థాయిలోనే



పరిష్కార మార్గాలు చూపించి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు బియ్యం, నగదు పంపిణీ



జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట మండలం గుర్రంపాలెం పంచాయతీ సగర పేట, గుర్రంపాలెం గ్రామాలలో ఉన్న పేద కుటుంబాలకు బియ్యం బస్తాలు,నగదు జనసేన అధ్యక్షులు గాది నాగరాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజవర్గ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముందుగా సగరపేటలో ఉన్న భగీరధుని విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం పేదలకు బియ్యం బస్తాలు నగదు అందజేసారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ సహృదయంతో పేదలకు తన సొంత ఖర్చుతో బియ్యం బస్తాలు, నగదు పంపిణీ చేసిన గుర్రంపాలెం పంచాయతీ జనసేన అధ్యక్షులు గాది నాగరాజుని అభినందించారు. నాగరాజు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సహాయ గుణంతో జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ సహకారంతో ఈ కార్యక్రమాలు నేను చేయడం జరుగుతుందని పేదలకు సహాయం అందించడంలో నేను ఎప్పుడు నా వంతు సహాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల అధ్యక్షులు మరిసే రామకృష్ణ, గండికోట పాండు, నక్క గంగరాజు, గాది రాము, గండికోట శ్రీను, గండికోట చిన్ని, నక్క దుర్గారావు, గండికోట అబ్బులు, గండికోట బాలాజీ, గాది జయన్న, నక్క రమణ, గాది తాతాజీ, మాదారపు వీరబాబు, గంధం ప్రభాకర్, దాడి చిన్న బుజ్జి, కాయల మణికంఠ, పాలెం బాబీ, గంధం శ్రీను, సత్తి సోమరాజు, చిక్కాల భగవాన్, బోండా నంది బాబు, కురుమల్ల నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

# అడ్డతీగల అటవీ రేంజర్ సస్పెన్షన్

అడ్డతీగల, మేజర్ న్యూస్ : అడ్డతీగల రేంజ్ పరిధి అటవీ శాఖలో రేంజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సెహన్నాను విధుల నుండి సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అడ్డతీగల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ రెడ్డిని కూడా సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే 2025 డిసెంబర్ 15వ తేదీన ఫోక్స్ పేట రేంజ్ పరిధిలోని నెల్లిపూడి వద్ద రాత్రి సమయంలో పిడతమామిడి బీట్ ఆఫీసర్ నవంబరు 23 నాటి చలానాతో వాహనంలో తరలిస్తున్న సోమేతి చెట్టును పట్టుకొని ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహించగా అడ్డతీగల సెక్షన్ పరిధిలో నుండి కలప దారుడు చూపిస్తున్న నకిలీ చలానాతో పరిమితికి మించి తక్కువ రుసుముతో తరలిపోతున్నట్లు గుర్తించారు. ఈ విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డిని నాలుగు రోజుల క్రితమే సస్పెండ్ చేయగా చలానా మంజూరు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా క్రింది స్థాయి సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారని అభియోగం మేరకు రేంజర్ సెహన్నాను సస్పెండ్ చేయడమే కాకుండా గోకవరం రేంజర్ కొండలరావుకి ఇన్చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇప్పటికీ పెద్దదైన అడ్డతీగల రేంజ్ పరిధిలో ఉండాల్సిన సిబ్బంది కన్నా తక్కువ సిబ్బందితో విధులు నెట్టుకొస్తూ సతమతమవుతున్న ప్రస్తుత తరుణంలో గడిచిన సంవత్సరంలో ఇక్కడ పనిచేస్తున్న వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న ఆరుగురు అధికారులు సస్పెండ్ అవ్వడం జరిగింది. దీంతో ఇక్కడ మిగిలిన సిబ్బందిపై అదనపు భారం పడుతుందని మిగిలిన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఉచిత వైద్య శిబిరాలతో సామాన్యులకు ఉపయోగం : ఎస్ఐ డి.రామకృష్ణ

చాట్రాయి,మేజర్ న్యూస్: గామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం సామాన్య ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని చాట్రాయి ఎస్సై డి రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కోటపాడులో శివాలయం భక్త బృందం ,సహాయ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రమ ఆస్పత్రి వారి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ కమిటీ, స్వచ్ఛంద సంస్థలు సామాన్య ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ నవ్య ఆధ్వర్యంలో 82 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 19 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు గుర్తించినట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా గురువారం ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు ఆశ్రమ ఆస్పత్రి పిఆర్వో సురేష్ తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు, కుమ్మరికుంట భాస్కరరావు, మోదుగుమూడి ధర్మారావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## గొట్టుముక్కల భాస్కరరాజు వితరణతో వయోవృద్ధులకు రగ్గులు పంపిణీ



జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ : స్థానానిక 4వ వార్డు ఇందిరా నగర్ కాలనీ లోని సీతారామాంజనేయ స్వామి వారి దివ్య సన్నిధిలో వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఆలయ నిర్మాణ కర్త,4వ వార్డ్ కౌన్సిలర్ వలవల తాతాజీ నిర్వహణలో వారధి ఆధ్వర్యంలో సోమవారం గోకుల తిరుమల పారిజాత గిరి ఆలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి గొట్టుముక్కల భాస్కరరాజు జన్మదిన సందర్భంగా వారి వ్యక్తిగత వితరణతో వయోవృద్ధులకు రగ్గులు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి సీనియర్ నాయకులు అర్జుల మురళీకృష్ణ పంపిణీ ప్రారంభిస్తూ భాస్కరరాజు జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాల నిర్వహిస్తున్నందుకు అభినందించారు.

వలవల తాతాజీ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు.కౌన్సిలర్ వలువల తాతాజీ, కె.ఎల్.ఎన్ ధనకుమార్ దాత భాస్కర రాజుకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వలవల మేరీ సుశీల,రెబ్బ రంగమ్మ, బసవరాజు, వేణు,తదితరులు పాల్గొన్నారు.

# పశువుల ఆరోగ్య పరిరక్షణ, ఉత్పాదకత పెంపు, వ్యాధుల నివారణే లక్ష్యం

**– పెరవలి పశువైద్యాధికారి డాక్టర్ వానపల్లి చరణ్ ఫణీంద్ర**



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండలం ముక్కామల గ్రామంలో జనవరి 19వ తేదీ సోమవారం పశు వైద్య సేవా శిబిరం నిర్వహించారు. ముక్కామల కూటమి నాయకులు ప్రారంభించిన ఈ శిబిరంలో పాల్గొన్న పెరవలి పశు వైద్య అధికారి డాక్టర్ వానపల్లి చరణ్ ఫణీంద్ర మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ, ఉత్పాదకత పెంపు, వ్యాధుల నివారణే లక్ష్యంగా జనవరి 19 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు పెరవలి మండలం లోని పశుపాలక రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు చరణ్ ఫణీంద్ర అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పెరవలి మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామస్థాయిలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పశుపాలక రైతుల పశువులు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ శిబిరాల్లో పాలిచ్చే పశువులు, దూడలు, గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ (పురుగుమందుల పంపిణీ), గొర్రెల మశూచి టీకాలు, కోళ్లకు మరియు బాతులకు టీకాలు వేయడం, అలాగే ఉచిత పశు వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా పశువుల ఆరోగ్యం మెరుగుపడి రైతులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని పెరవలి మండలంలోని అన్ని గ్రామాలలో ఉదయం 8.00 గంటల నుండి పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. పశుపాలక రైతులు తమ పశువులను శిబిరాలకు తీసుకొచ్చి ఉచిత పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చరణ్ ఫణీంద్రతో పాటు ఖండవల్లి పసు వైద్యాధికారిని డాక్టర్ సల్మా, ముక్కామల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ వనిత, రాజేష్, కూటమి నాయకులు నల్ల సురేంద్ర, వెంద్ర వెంకటరామూర్తి, రేలంగి రాజేష్, చిట్టిడి త్రిమూర్తులు, ముత్యాల పట్టాభిరాము తదితర నాయకులు పశు పెంపకం దారులు, పాడి రైతులు పాల్గొన్నారు.

# జగ్గంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి



జగ్గంపేట, మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన జగ్గంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురామ్ డిమాండ్ చేశారు. స్థానిక శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల్లో సోమవారం ఆయన జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ జగ్గంపేటలో ఉండే కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను గండేపల్లి మండలం జెడ్ రాగంపేటకు తరలించడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలం మారడంతో సిబ్బంది రాజపూడి పిహెచ్సికి మార్చడం జరిగిందన్నారు. దానివల్ల సిబ్బంది అందుబాటులో లేక ప్రజలకు వైద్య సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నారన్నారు. మండల ప్రజల కోసం అనువుగా ఎంఎల్ఎ పి హెచ్ సి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చెరుకూరి జయరాజ్, మల్లిమొగ్గల శ్రీహరి పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 అర్జీలు



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 5 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు తెలిపారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఏఓ సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎడిఎ దైవకుమార్, ఎ.ఎస్.డబ్లూఓ. వాణి, డిఎల్పిఓ కార్యాలయ ఏఓ మైథిలి, హౌసింగ్ ఏఇ రవిశంకర్, డివిజన్లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పిజిఆర్ఎస్‌కు రెండు అర్జీలు



పెద్దాపురం, మేజర్ న్యూస్ : సోమవారం పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి రెండు అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, జి.ఎస్.డబ్లూ.ఎస్. మేనేజర్ ప్రసాద్, వెంకటలక్ష్మీ, సుజాత, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తా...

**– 10 మందికి స్వల్ప గాయాలు**



**పిఠాపురం/గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తా పడి 10 మందికి గాయలైన ఘటన సోమవారం 19 వ తేదీ తెల్లవారు 1.00 గంట సమయంలో చేబ్రోలు సత్తెమ్మ తల్లి గుడి సమీపంలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై గొల్లప్రోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీ విజయ కృష్ణ ట్రావెల్స్ కు చెందిన (ఏపీ 39 యూజెడ్ 3255) గల స్లీపర్ బస్సు శ్రీకాకుళం నుండి బయలుదేరి భీమవరం నకు వెళ్లుచూ మార్గ మధ్యలో కత్తిపూడి నుండి పిఠాపురం వైపునకు పోవు రోడ్డులో దుర్గాడ జంక్షన్‌కు ముందు శ్రీ కోటసత్తేమ్మ అమ్మ వారి గుడి ఎదురుగా గల పంట పొలములోనికి ప్రమాదవశాత్తు దూసుకొని వెళ్లి ప్రక్కకు తిరగబడినది. ఆ సమయంలో బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులు వరకు ప్రయాణించు చుండగా సుమారు 10 మందికి స్వల్ప గాయములు కాగా వారిని పిఠాపురం గవర్నమెంట్ హాస్పిటల్ నకు తరలించి చికిత్స చేయించి, అనంతరం వారి స్వస్థలం నకు తరిలించినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ మరియు కాకినాడ, గొల్లప్రోలు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గౌరి శంకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదుపై గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ ఎస్సై ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు

**పాలకొల్లు, మేజర్ న్యూస్:** పట్టణంలో వెంచేసియున్నా శ్రీ క్షీరరామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు సోమవారము శివనామస్మరణతో 7 మారేడు దళములతో 7వారములు సప్త ప్రదక్ష ణములలో సుమారు 200 మంది భక్తులు పాల్గొని శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామివారిని దర్శించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు భక్తులకు క్యూ లైన్స్ లో వెళ్ళుటకు తగు ఏర్పాట్లు చేశారు. రాత్రి 7 గం.లకు దూప సేవ రాత్రి 7.30 గం.నిం.లకు పంచ హారతులు సేవ జరిగింది. ఆలయ సూపరింటెండెంట్ పి.వాసు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చొరవ చూపారు...సమస్య పరిష్కారానికి బాటలు వేశారు





**– జడ్పీ ఉన్నత పాఠశాల మారమ్మతులకు చర్యలు**
**– వైస్ ఎంపీపీ దొంతు సొంత ఖర్చులతో సామగ్రి తరలింపు.**
**– పరిశీలించిన మండల పరిషత్ జేఈ రామయ్య**

**ఎటపాక, మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు మరో అడుగు ముందుకు వేశారు. పోలవరం (రంపచోడవరం) జిల్లా ఎటపాక మండలం గౌరీదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎటపాక వైస్ యంపిపి దొంతు మంగేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపారు. పాఠశాల భవనాలు మరమ్మతులు సహా, ఇతరాలు వాటికి సొంత ఖర్చులతో సోమవారం సామగ్రి తరలించారు. మండల పరిషత్ జేఈ రామయ్య పాఠశాలను ఎంపీపీ తో పాటు పరిశీలించారు. ఈ సందర్భంగా దొంతు మంగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్వాకం వల్ల పాఠశాలలో కనీస వసతులు కరవయ్యాయన్నారు. నాడు–నేడు పథకం నామ మాత్రంగా అమలు చేశారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా గౌరీదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పాఠశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పనులు త్వరిత గతిని పూర్తి చేయాలని గుత్తేదారు సురేష్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివకనకరాజు, ఉప సర్పంచ్ మడకం నరసింహారావు, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు అమవరపు రాము, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.